దేవుడు

శ్రీమతి వెంకాయమ్మగారు

కళకు తెలివివచ్చిన నాటినుండియు 'భర్త దేవుడు' అను శబ్దముల ఝుంకారము వీనుల విందగుచుండెను. తన సోదరీమణుల వివాహ మగునపుడుగూడ ఆమెతల్లి యీపాఠమునే బోధించెను. తన సఖీమణులు అత్తవారిండ్ల కేగునపుడుగూడ ఆమె యీపవిత్రవాక్యలనే వినియుండెను. 'భర్త దేవుడు' అని యామె భావింపసాగెను. ఇదియొక మహా మంత్రమైయుండెను. వివాహ సూత్రములతో బంధింపబడు ప్రతిబాలికకు ఈ మంత్రము యొక్క దీక్ష తీసుకొనుటయు జీవితపర్యంతము దానిని జపించుటయు నవసరమై యుండెను. ఈ విధమైనవాతావరణలో పెరుగు అన్యబాలికలు ఈమంత్రమును వినినను, మరల మరచుచుండిరి. మరికొందరు దానినివిని నవ్వుచుండిరి. వారి మనసులలో దీనియందు ఉపేక్షగాని అసహ్యతగాని కలిగి నందునగాదు. మరెందువలన? దీనినిఅనగా నీమంత్రమును ఒకవిధమైన మూఢాచారమని భావించినందున ఈగీచినగీత దాటకుండుటయే ప్రతిస్త్రీయొక్క జీవితపుకర్తవ్యమని వారు భావించుచుండిరి. కొందరికు ఈమంత్ర మందలి భావమును గ్రహించుట, యొక యబోధబ్రాహ్మణునకు భగవద్గీతయందలి శ్లోకముల గ్రహించుటెంత కష్టమో యంత కష్టమైయుండెను. కాని, గ్రహింపజాలకే గూడ ఆబ్రాహ్మణుడు నిత్యము దాని జపము చేయుచుండును అట్లుచేయుటలో వానియుద్దేశము ఇచ్చుట అవశ్యకమనియు తదుపరిలోకసౌఖ్యములబ్బునవనియు ఇదేవిధమున నాబాలికలుగూడా ఇహపరలోకములకై ఆ మూలమంత్రమును జపించుచుండిరి.

కళ యీ బాలికలకంటె కొద్ది భిన్నమైనది. ఆమె యిట్టి ప్రశ్నలపై లోలోన తర్కించుచుండును. ఆమె దేవతల విషయమై వినియుండెను. కొందరిపేరులమాత్రమే యెరిగియుండినను హిందువులకు ముప్పది మూడుకోట్లదేవతలు గలరని ఆమెకు తెలియును. ఆమె వినియున్నవారినిగురించి విపులముగా వినియుండెను. ఆమె తనసోదరీమణుల యొక్కయు సఖీమణులయొక్కయు భర్తల గూడ చూచియుండెను. ఈభర్తలయొక్కయు ఆదేవతలయొక్కయు సమానత్వమేమి యా యని యామె పలుసారులువిచారించెను. దేవతలు ఏదియైన యశమైన కార్యమును సాహసకృత్యములను జేసియుండిరి; కాని యీ భర్తలలో అట్టి కార్యములజేసినవారు అత్యల్పము. దేవతలపూజ అందరును జేయవచ్చును గాని భర్తల పూజజేయుట మాత్రము వారి భార్యలకు మాత్రమే కర్తవ్యమనుకొనిరి. వివాహమైనంత మాత్రమున ప్రతిపురుషునకును తన భార్యకు దేవుడగు నధికారము గలదు. అట్టిచో వివాహమైనతరువాత తన భర్తకు తాను దేవియగు నధికారమెట్లు గలుగదు? దేవతలభార్యలు దేవులని యని పించుకొనుచుండరా? ఈ నర దేవతల భార్యలు ఆపదనుండి వంచింపబడు

బొందునా? ఇదంతయు నగోచరముగానున్నది. లింగభేదమే వీటన్నిటికినికారణమా? పురుషులు మాత్రమే యీపదవిని గ్రహింప నర్హులుగాని స్త్రీలుగారా?

నిత్యము నిట్టి తలంపులు కళయొక్క మానసము నాక్రమించుచుండె. ఆమె వాటిని తర్కించుకొనుచుండును. కాని, సంతోష జనితమగు ఏనిర్ణయముపైకి రాజాలకుండెను. ఒకదినమామె తన తల్లితో నీ విషయములపై వాదములుజేయ సాహసించెను.

“అమ్మా!” ఆమె యనుమానించుచూ పిలచెను. తల్లి యామెవైపు జూచెను. ఆమె కన్నులు కళయేమి యడుగునోయని అకన్నుల బ్రశ్నించుచుండెను.

“భర్త దేవుడుగదా?”

“అవును”

“అందరి భర్తలును?”

“అందరి.”

“వారెట్లున్ననుసరే?”

“వారెట్లున్ననుసరే. ఎవరు సూత్రధారణ జేసిరో వారెట్లున్నను సరే స్త్రీకి సదా దైవమే.”

“స్త్రీ వారి దేవిగాదా?”

“భలే, యిదియెట్లగును? స్త్రీ తనభర్త యొక్క చరణదాసీ గాగలదు.”

“భర్త కెంతయున్నతపదవియు భార్య కెంత నీచపదవియునా?”

“ఇది ధర్మశాస్త్రముల యాజ్ఞ.”

“ఇది మార్పుజెందజాలదా?”

“ఎట్లు మాట్లాడుచున్నావు? ధర్మగ్రంథముల విషయములుగూడ మార్పుజెందునా? మార్పుజెందునది ధర్మమెట్లగును? పూర్వపు పెద్దలనాటినుండివచ్చు మర్యాదను సదా పాలింపవలసినదే. జాగ్రత్త, యిట్టి మాటల నెన్నటికిని పెదవిపైకి రానివ్వకుము. శాస్త్ర విరుద్ధముగా మాటలాడువానికి నరకమందును స్థానములేదు.”

కళ మౌనముదాల్చెను. “భర్తదేవుడు” ఇది ధర్మశాస్త్రముయొక్క యాజ్ఞ. ధర్మశాస్త్రపువాక్కు అవినాశము. దానినెవ్వరు మార్పజాలరు. ఆమె మరెప్పుడు నీవిధమైన జిజ్ఞాసజేయలేదు. ఆయాచారమును తానికపాలింపవలసియున్నదని నిర్ణయించుకొనెను.

౨

కళయొక్క వివాహదినము సమీపించెను. తనకై యేదేవుడు సృజింపబడుచుండెనో యాదేవుని విషయమై యామెకేమియు తెలియదు. ప్రజలు తాము పూజించు దేవతల విషయమై ప్రథమమున కొంచెమో గొప్పయో తెలిసికొనియుందురు. ఒకడు వాని గుణములపై ముగ్ధుడై యాదేవుని పూజించును. మఱొకడు దానివలనగలుగు నుపకారముపై యాశగలిగి యాదేవుని భక్తుడగును. కాని కళకు తనదేవుని గుణముల గూర్చిగాని వానివలన గలుగబోవు నుపకారములగురించిగాని తెలియదు. తనతల్లి యామె హృదయమందు నొకయజ్ఞాత అదృశ్య దేవునియెడల యంధ భక్తి భావమును పెంపొంద జేయుచుండెను. ప్రతి వివాహితయువతికి నిచ్చు మూలమంత్రము

యొక్క జపోపదేశమునే యామెకూడ కూతునకు తెలియజేయుచుండెను. "భర్త దేవుడు." "భర్త దేవుడు" అను శబ్దము కళ యొక్క కర్ణములయందు ప్రతిధ్వనించుచుండెను. ఆమె తన బంధుబాంధవులకు వేరై తన దేవుని వెంట వెళ్లినప్పుడు నయితేను ఆమె తల్లి తన చెవులలో మరల నా మంత్రమునే యూదెను.

"బిడ్డా, 'భర్త దేవుడు' ఈమాటనెప్పుడును మరువకు."

"ఆయనఎట్లున్నను సరే?"

"ఎట్లున్ననుసరే."

"దురాచారియైననుసరే, త్రాగుబోతైననుసరే, వ్యభిచారియైననుసరే?"

"దేవునిదోషములు జూచుటకు భక్తుని కధికారములేదు."

"ఆయనయొక్క పూజజేయుటయే ఆమె యొక్క ధర్మమా?

"అవును. ఆమెసర్వస్వమును ఆయనకు ధారబోయునుగాని యేవస్తుప్రాప్తికొరకును ప్రత్యాశమాత్రము గలిగియుండజాలదు. ఆమె వద్ద నున్నదంతయు తన దేవునిపూజ నిమిత్తమే."

"దేవునికేవస్తువ యావశ్యకమో దానినే యర్పించుటావశ్యకమా?"

"దానినే."

స్త్రీరూపేణ యామెకేది ధర్మమో యా యుపదేశము దొరికినది. ఆమె దానిని గట్టిగా ముడివైచికొనినది. ఏదైనా వాద వివాదమునకుగాని తర్కించుటకుగాని యామె కధికారములేదు. అచ్చట అంధశ్రద్ధమూలమునకే పనిగాగలదు. ఏజీవితము స్వకీయముజేసికొన బోవుచున్నదో యచ్చట తర్కమునకుగాని, యవిశ్వాసమునకుగాని స్థానములేదు. వీటివల్లనైతే యాజీవితమే నష్టమగు భయముగలదు. తనతల్లి జూపిన మార్గముపై కన్నులు మూసికొనిపోవుటయే యామె కర్తవ్యము. తన సర్వస్వమును, తన యాత్మను, తన శరీరమును, వీటన్నిటి కంటె మరేమైననున్నచో దానినిగూడా ఆదేవుని యిచ్ఛానుసారము నిశ్శబ్దముగ నర్పించుటయే యామె ధర్మము. ఆమె యా కర్తవ్యమును నెరవేర్చుటకును, ఆ ధర్మమును పాలించుటకును ప్రతినబూనెను.

3

కళ యత్తవారింటికి వచ్చినది. ఆమె భర్త మధ్యవయస్కుడు. ధనవంతుడు. ఇట్టి వివాహములలో నడివయస్సు, ధనము ఈ రెంటికిని గాఢసంబంధముండును. వయస్సెంత యాధిక్యమైయుండునో ధనముకూడ అంత యాధిక్యమైయుండవలెను. వధువు, వధువుయొక్క తండ్రి, వరునియింటియందలి ధనరాసిని చూడగనే వరుని వయస్సుయొక్క లెక్కను మరచెదరు. అరువదివత్సరముల వయస్సు, వారిదృష్టిలో ముప్పదియై యుండును. యదార్థములో వధువును మనుష్యున కిచ్చి వివాహము చేయుటలేదు! ధనమున కిచ్చి చేయుచున్నారు. ఇట్టివివాహమే కళది గూడాను. ఆమెభర్తయొక్క వయస్సు వృద్ధుడనదగునంత కానప్పటికిని కళయొక్క తండ్రి,

వరుని ధనమును జూచియేయామె నాయన కిచ్చెను.

ఇట్లున్నప్పటికిని కళ, తనతల్లి జెప్పిన మంత్రము ననుసరించియే తనజీవితమును గడుప జూచుచుండెను. తనభర్తను వాస్తవముగా దేవుడనుకొని పూజింప గోరుచుండెను.

వివాహమై కళ యత్తవారింటికివచ్చి చాలా రోజులైనది. నేటివరకు తనపతినుండి యొక స్నేహదృక్కైనను, లేక యొకప్రేమశబ్దమైనను ఆమెకు లభింపలేదు. ఆరోజు సంధ్యాసమయమున నామెవంటజేసెను. ఆ వంట చాలాప్రేమతోను అవధానముతోను జేయబడెను. వంటసిద్ధముజేసి కళ పతికొరకై యెదురుచూచుచుండెను. సమయము గడచుచుండెనుగాని పతిదేవుడు రాడాయె. ఆయనరాకలో నింత యాలస్యమైనదిదే ప్రథమదివసము. పరిపరివిధములనాలోచించుచూ కళనంటయింటనే పీటపై గూర్చుండెను. ఎనిమిదిగంటలు, తొమ్మిది, చివరకు పది! ఆమెయచ్చటే కూర్చుండెను. ఇంతదనుక రానికారణమేమైయుండవచ్చును? ఒకొక్కతూరి వ్యాకులయగును: మరొకతూరి తానే సమాధానము జెప్పుకొనును. పదకొండు గంటలు. ద్వారము శబ్దమాయెను. ఆమె పరుగెత్తివెళ్లి ద్వారము తెరచెను.

ఆమెచూచిన దృశ్యమువలన కింకర్తవ్యవిమూఢమన్నటులయ్యెను. ఆమెకు తనపతిదేవుని ఈ దశలో చూచు ఆశలేదు. ఆయన కాళ్లుతూస్చుచు లేచుచు పడుచూ వచ్చుచుండెను. నేత్రములు ప్రజ్వలిత అగ్నికణములయ్యెను. చెప్పగోరునది స్పష్టముగా చెప్పజాలకుండెను. తనవిషయమైగాని యితరులవిషయమైగాని తెలివిలేకుండెను. బాగా త్రాగియుండెను.

కళయొక్క ప్రాణము లెగిరిపోయెను. ద్వారము బంధించి పతిదేవు నింటిలోనికి దెచ్చెను. మంచముపై పరుండజేసి శీతలజలము ముఖముపై జల్లి గాలివిసరసాగెను. ఆదేవుడు మండిపడెను.

"ఏమియు చేయకుము, ఇటనుండి లేచిపొమ్ము." ఆయనపెద్దగా కర్కశస్వరముతో జెప్పెను.

"తమమన స్సెటులున్నది?" కళ యడిగెను.

"నీవు నన్నిచటనే వదలివెళ్లుమని చెప్పుచున్నాను."

"తమమనస్సు స్థిమితమైన పిమ్మటనే బోయెద."

"నామనసు శాంతించుట నే గోరుటలేదు. నేను నిద్రించెద."

"ప్రక్క బరచెదనా?"

"వద్దు"

"అయితే కొంచముభుజించి నిద్రించుడు భోజనము సిద్ధమైయున్నది."

"భోజనము హోయిలో బారవైచి పైన నీవుగూడ బడుము."

ఇట్లుజెప్పి యాదేవుడు మంచముపై పవ్వళించెను. కళగూడ భుజింపలేదు. చాలసేపటివరకు కళయశ్రువుల రాల్చుచు ఈదుర్ఘటనను గురించి చింతిల్లుచూ గూర్చుండెను. ఆమె దేవుడని భావించి పూజింపగోరు వ్యక్తి

736

యే యీనాస్తి. ఆమెకు తనదేవుని పైనను తనపైనను అసహ్యము గలుగసాగెను. కాని యీామెకు షురల అమంత్రమె—"దేవుని దోషములు జూచుటకు భక్తుని కధికారము లేదు"—జ్ఞాపకమువచ్చెను. ఆమెతన వివశత్వముపై నొకదీర్ఘ నిశ్వాసమును విడచి యొక ప్రక్క కొరగెను.

౪

ప్రాతఃకాలమయ్యెను. దేవునినిషా దిగిపోయెను. కళభోజనము సిద్ధముజేసి దేవుని ముందుంచెను. కొంతదనుక నుభయులు నిశ్చేష్టులై యుండిరి. తదుపరి కళ సాహాసనంచయముజేసుకుని రాత్రివిషయమును హెచ్చరించెను.

"తాము మద్యము గ్రోలెదరని యింతకు ముందు నాకు తెలియదు."

"ఇదివరలో తెలియకపోవచ్చునుగాని యిపుడు తెలిసినదిగదా?"

"అవును, కాని.........."

"కాని?"

"కాని, యిదిమంచిదిగాదు త్రాగుడు మానివేయండీ."

"మానవలెనా? ఎందువలన?"

"ఏలనన, యీవ్యసనము మంచిదిగాదు. నే రాసంతవరకు మీాయిచ్చ వచ్చినటుల జేయుచుండిరి. కానియివుడు........"

"ఇపుడేమైనా మార్పుగలిగెనా?"

"ఎందుకుగాదు? తమ జీవితములో నిపుడు నాజీవితముగూడ బంధింపబడి యున్నది."

"నీజీవితము బంధింపబడినది యింటి లోపలి నిమిత్తమేగాని యింటిబయటి నిమిత్తముగాదు. ఇంటిబయట నేనే సమస్తమునై యున్నాను. ఇష్టమొచ్చినది జేయగలను. నిను వివాహమాడినది నా పనులలో పలహాజెప్పెదవని గాదు. ఇంటి కావలిగాచి యింటిని చక్కబెట్టెదవని. నీవు కోరునదంతయు నింటనున్నది. ఇచ్చవచ్చినదీ తినుము. ఇష్టమున్నది త్రావుము. కోరినది ధరించుము. కాని యిదంతయు నింటియందలివరకే. ఇంటిబయటిచింత నీకు వలదు. నామాట నీకేదైనా యిష్టము లేనిచో కన్నులు మూసికొనుము, నోరెత్త వద్దు."

"నోరెత్తవద్దా? సమస్త విషయముల జూచుచుగూడ గ్రుడ్డినై యుండవలెనా? ఎటులైనను తమ పత్నినే గదా!"

"నీవు నా భార్యవనునది సరియేగాని నే నెవరినో తెలియునా?"

"పతి".

"పతి ఎవరు?"

"దేవుడు".

"దేవునికంటె భగవంతుడు గొప్ప. దేవునికేమి యధికారముగలదో తెలియునా?"

"పూజ".

"మంచిది, యిదియే కర్తవ్యము. నిశ్చబ్దముగా నావిషయమై కొంచెమైన విచారించక పూజచేయుము."

కళ నిశ్చేష్టయయ్యెను. ఏమి చేయగలదు! ఏ మూలమంత్రోపదేశము ఆమెకిదివరలో లభించెనో దానికిది పునరావృత్తి.

737

విషయ మభివృద్ధి జెందుచునేయుండును. కళయొక్క తండ్రి యేధనముకొరకు కళను ఆదేవుని కర్పించెనో యాధనము ఇపుడు లేదు. కళ తన యావజ్జీవితమును ఏదేవుని కొరకై దేవాలయమును నిర్మించెనో యది గూడా ఖాళీయయ్యెను. కళయొక్క దేవుడు మరొకరిపూజ నధికముగా ప్రేమించుచుండెను. కళకు తనకు నేమియు సంబంధము లేనటు లాయన యచ్చటకే వెళ్లి విరాజమానుడయ్యెను. ఆయనకు కళయొక్క పూజ యిష్టములేదు. కాని కళకు మాత్ర మాయన ధర్శనమొసగినా జాలు. కళ కందునిమిత్తమెగూడ తిరుగవలసివచ్చెను. ఆమె భర్త ఆమె దేవుడు! ఆయన సంతుష్టి కొరకై యామె యేమైనను జేయవలయునను యుపదేశము పొందియుండెను. ఆయన పూజయే, యాయనసేవయే చేయుట తన యొక్క ధర్మమని యామె గుర్తించెను. ఆ ధర్మము అవినాశమైనది, అఖండమైనది. అపరివర్తనీయమైనది. కళ యాధర్మమునకు బద్ధురాలై యుండెను. ఇందువలన ఆ రాక్షస కృత్యములుజేయు నాదేవునకుగూడ బద్ధురాలై యుండెను.

ఒకదిన మామెకు దైవదర్శనసౌభాగ్య మబ్బెను. ఆదినము కళ తన హృదయమంతయు విప్పివాని ముందుపెట్టెను.

“మీరు నన్ను ఈవిధముగా త్యజించుటకు నేనేమి యపరాధముజేసితిని. తమను దైవముగా దలంచి సహృదయముతో, విశుద్ధసంకల్పముతో పూజింపలేదా?”

“పూజింతివి—గాని?”

“కాని”

“నాహృదయ మాపూజచే సంతృప్తి నొందదు.”

“నాపూజచే సంతృప్తినొందరా? ఒక సద్వంశీయురాలైన తమ ధర్మపత్నియొక్క యదార్థపూజవలన సంతృప్తి కలుగదా?”—దేవుడు మాటలాడలేదు.

“ఏమి!!యా వారాంగనయొక్క పూజచే సంతుష్టిగలుగునా? ఆనందముగలుగునా?” అని మరలయనెను.

“కళా, యది హృదయముయొక్క భేదము.”

“ఆ వారాంగనయొక్క పూజలో నేమి విశేషముగలదు?”

“హృదయమును తనవైపున కాకర్షించు విశేషముగలదు.”

“అది బహుశః కులలలనగానందున నట్లుండవచ్చును. ఏలయన, నామె యొక వస్తువును, రూపమును, యావనమును, సతీత్వమును బేరమువలె నమ్మివేయును.”

“పూజగూడ నొకబేరము. పూజయందుగూడ దేవునికి వాంఛితపదార్థము లావశ్యకములు. ఆపదార్థము అధికముగా దొరకు స్థలమునందలి పూజనే యాయన ప్రేమతో స్వీకరించును.”

“పూజగూడ నొకబేరము” ఈమాటను తన దేవుడు లేచి వెళ్లినపిమ్మట కళ యాలోచించసాగె. యదార్థహృదయముతో జేయు పూజ కేమియు విలువలేదు. బాహ్యాడంబర పదార్థములనే యందరు ప్రేమింతురు.

738

“మంచిది దేవా! నీకిష్టమైన పదార్థములనే సమర్పించెద. ధర్మవాక్కునే వల్లించెద. శాస్త్రముల యాజ్ఞను సమ్మతించెద. ఆ సాంతముదనుక దేవుని ప్రసన్నుని జేయు నుపాయ మాలోచించెద. ధర్మము! దేవుడు! పూజ! బేరము!”

ఇట్టి సమయమున నామె ముఖముపై హాసమును నేత్రములలో నశ్రువులును గలవు.

దేవునియందు వరముల నొసగుశక్తి యున్నంతవరకు పూజారిని తన మనోధనములతో పూజజేసెను. కానియెప్పుడు ధనమను వరమొసగు శక్తిక్షీణించెనో యప్పుడు వారాంగన దేవుని దేవాలయమునుండి పారద్రోలెను.

తిరుగుచూతిరుగుచూ దేవుడు రెండవ ద్వారమునదట్టెను.

ద్వారము విడిపోయెను. తలవాల్చి దేవుడు కుర్చీపై నాసీనుడాయెను.

“మద్యము”!— ఒకచిన్న గిన్నెనుముందుంచి యొక యువతియనెను.

దేవుని నిద్రభంగమయ్యెను. కన్నుల పైకెత్తిజూచెను. ఇదేమి? మరలకన్నులు పైకెత్తిచూచెను.

“కళా!”

“అవును నేను నూత్న పూజారి రూపములోనున్న కళను”

“నేనేమి చూచుచున్నాను?”

“ఏమి తమకీరూపము నచ్చలేదా? తమకీరూపము నచ్చునని సెలవిచ్చియుంటిరి గదా!”

“ఓ భగవంతుడా! నీవిక్కడ....... .. ఒక్క.........”

“.........వేశ్య!”

“కాదు కళా, నీవు నా భార్యవు. నా భార్య వేశ్యయా?”

“ఏమియిప్పుడైనదేమి? యితర వేశ్యలు గూడ నొకరి భార్య లేగదా! మీకు గావలసినది పూజారి రూపముగదా! మీకు గావలసినవి. రూపము, కువాసనలు, కులటతనము, బాహ్యహావభావములుగదా! అవి మీకిపుడు దొరకుచున్నయవి. నేటివరకు అన్యవారాంగన ప్రసాదింపుచూవచ్చెను. నేడు మీ ధర్మపత్నియే వాటినొసంగుచున్నయది.”

ఆమె సమీపించెను. దేవుడు రెండుచేతులతో తలబట్టుకొని యాలోచింపసాగెను.

“ఆలోచించున దేమిటి? మద్యమును సేవించుడు. నేనైతే చాలాదినములనుండి యీ రోజును ప్రతీక్షించుచుంటి. ఇంటియందలి నా పూజ పనికిరాలేదు, ఇచ్చటనైనను స్వీకరించుడు.”

“మాట్లాడబోకుము కళా! హా! ఏమినే నిట్లుజేసితిని! నా పాప మీప్రకారము ఫలించునని నేదలంచనైతి. ఎట్టియనర్థమును జేసితిని?”

“అనర్థమెట్లు? ఇది ధర్మశాస్త్రముల యాజ్ఞ! ప్రాచీనప్రథ! పతి దేవుడు, పత్ని దాసి. ఆయన స్త్రీని ఇవ్వవచ్చినటుల జేయవచ్చును. స్త్రీ మాత్ర మేవిధమునైనను, తానేమైననుసరే పతిని సంతుష్టుని జేయుమార్గము వెదకవలయును; ఆమె యేమైననుసరే!”

“దీనిని నీవు విశ్వసించెదవా?”

739

"అవును. నా కీజన్మనుండియు నిదే నేర్పబడినది."

"ఇప్పుడుకూడా విశ్వసించుచుంటివా?"

"అవును."

"సత్యముచెప్పుచున్నావా?"

"దేవునియెదుట నసత్యమెట్లు జెప్పగలను?"

"ఇప్పుడుకూడా నన్ను దేవునిగా భావించుచుంటివా?"

"అవును."

"నాకొరకై నేగోరినదిజేయగలవా?"

"చేయగలను"

"అదెంతకఠినకార్యమైననుసరే?"

"ఇప్పుడునే జేసినదానికంటె కఠినకార్య మేమియుండగలదు?"

"మృత్యువు."

"కాదు."

"అయితే నాతోగూడ నాసంతుష్టికొరకు మరణింపగలవా?"

"సంతసముతో"

"రెండుగిన్నెలు మద్యముతో నింపుము" కళ రెండుగిన్నెలను మద్యముతో నింపెను. భర్త రెంటిలో యేదోనొకచూర్ణమును గలిపెను.

"తీసికొనుముదీనిని"

ఉభయులు గిన్నెలనెత్తినోటనిడుకొనిరి.

"త్రాడుతోడుగానరకమునకు"— పతి యనెను.

"దేవునివెంట నెచటికైనాసరే!",

"దేనిని ఈ జన్మలో ఈసమాజములో చేయజాలమైతిమో దానిని ముందరిజన్మలో మరొకసమాజములో జేయుదుముగాక!"

ఉభయులునుగిన్నెల వదలిరి. ఉభయులును ఒకరుమరొకరి హస్తముల గ్రహించిరి. ఒకరిమొగమువంక నొకరు జూచుకొనుచూ విషపాత్రలను జారవిడచిరి.

('చాందు' నుండి)

వాసంతసంధ్య

శ్రీమతి రత్నాపళిగారు

శ్రీవసంతలక్ష్మమృగాక్షీమనోజ్ఞ
మధురతరకౌముదీనిభ మందహాస
రుచులపులకితమై సాంధ్యరోచులందు
చెలగి కోకిల గానముచేయసాగె.
కుసుమసౌరభమును మోసికొనుచు జనుల
కాయముల కతిహాయినిగలుగ జేసి
కొలనిజలములపై నుండి కొసరికొసరి
మలయుపవమానబాలుండు మసలుచుండె
ప్రాంతతరుపోతపంబులు భూజములకు
సుమలతలకు సత్యంతమౌశోభగూర్ప

దివ్యసౌందర్య కాంతుల తేజరిల్లి
బంగరుమలాముచేసినభంగిదసరి
మాధవీలత యొకతీయ మావిమోక
జుట్టుకొని సుమములతోడసుందరియగు
కాంత యనుకూలుడగులతనకాంతుగాఢ
తరపరిష్వంగ మొనరించుకరణినుండె
ప్రేయసియుప్రియుడును తమప్రేమభరిత
హృదయభావాల నొండొరులెరిగికొనుచు
కుసుమమంజరులనుమాలగూర్చుకొనుచు
పూవుడేరాలలో ప్రొద్దుపుచ్చినారు.

740